

తాడ్వాయి అంగన్‌వాడీలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

తాడ్వాయి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పూర్తిస్థాయిలో తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో ఆయన మంగళవారం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులను ఎంతో శ్రద్ధతో చూసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగినప్పుడు విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అన్ని రకాల విద్యా బోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. అనంతరం అక్కడే నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నాణ్యతగా ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో అందించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, నాయకులు శ్యామ్‌రావు పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీలో ఉన్న వారికి ఇన్సూరెన్స్ చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో ఉన్న వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలో అందరికీ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించడం, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన నిర్వహించారు. ప్రస్తుతం ఇన్సూరెన్స్ అనేది ముఖ్యమైన భాగంగా మారిందని దానికి సంబంధించి ప్రతీ ఒక్కరికి మినిమం ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఏవో తిరుమల ప్రసాద్, డీపీఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడి సమావేశాన్ని విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈనెల 4న గ్రామ అధ్యక్షులతో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కోరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంస్థల నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, రాజాగౌడ్, గంగాధర్, కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా!



గాంధారిలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

- జిల్లాలో నెలకొంటున్న యూరియా కొరత
- డిమాండ్‌కు తగ్గట్టు సొసైటీల్లో లేని ఎరువుల నిల్వలు
- ఇప్పటి వరకు సరఫరా అయిన 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా
- ప్రస్తుతం 700 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాలో స్టాక్
- సొసైటీల వద్ద యూరియా కోసం రైతుల బారులు
- మరికొన్ని చోట్ల ఆందోళనకు దిగుతున్న అన్నదాతలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేట్ డీలర్లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

కామారెడ్డి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం పంటల సాగు ఊపందుకున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటలను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలు కలుపునకు సైతం వస్తుండడంతో యూరియాకు డిమాండ్ నెలకొంటుంది. అయితే జిల్లాలో యూరియా కొరత నెలకొంటుండడంతో రైతులు సొసైటీల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. డిమాండ్‌కు తగ్గట్టుగా సొసైటీలకు యూరియాను అధికారులు సరఫరా చేయకపోవడంతో ఏ రోజుకారోజు వచ్చిన వెంటనే లారీల కొద్ది ఖాళీ అవుతోంది. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో డిమాండ్‌కు తగ్గట్టుగా సొసైటీలకు యూరియాను సరఫరా చేయడం లేదని రైతులు మండి పడుతున్నారు. దీంతో సొసైటీల వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేపడుతుండగా మరికొన్నిచోట్ల రోడ్డెక్కి రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఇక ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా నిల్వలు ఉన్నప్పటికీ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇతర ఎరువులను కొంటేనే యూరియా బస్తా ఇస్తామంటూ ప్రైవేట్ డీలర్లు మెలికలు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం ప్రైవేట్ డీలర్లపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

సీజన్‌లో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

వానాకాలం సీజన్‌లో లక్షల ఎకరాల్లోనే పంటలు సాగవుతాయి. పంటల సాగుకు తగ్గట్టు ఈ సీజన్‌లో ఎరువుల వినియోగం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ సీజన్‌లో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వీటిలో ఎక్కువగా యూరియా వినియోగమే ఉండనుంది. 68,654 మెట్రిక్ టన్నుల యూరియా వానాకాలంలో అవసరం కానుంది. 44,762 మెట్రిక్ టన్నుల్లో కాంప్లెక్స్, 18,222 మెట్రిక్ టన్నుల్లో డీఏపీ, 16,926 మెట్రిక్ టన్నుల్లో ఎన్‌ఓపీ ఎరువులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. అయితే సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లాలో యూరియా 8,122 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా కాంప్లెక్స్ 4,969 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1767 మెట్రిక్ టన్నులు, ఎన్‌ఓపీ 260 మెట్రిక్ టన్నుల స్టాక్‌ను అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ జిల్లాలో మాత్రం ఎరువుల కొరత ఏర్పడుతోంది.



పలు ప్రాంతాల్లో నిల్వ ఉన్న యూరియా

సొసైటీల వద్ద అరకొర యూరియా

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 68వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు నిర్దేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావడంతో జిల్లాలోని సొసైటీలతో పాటు ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేశారు. ప్రస్తుతం ఈ స్టాక్ పూర్తిగా అయిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 5.36 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అయితే ఈ పంటల సాగుకు తగ్గట్టుగా 68 వేల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కానుంది. జూన్-జూలై పంటల సాగు జరుగుతుండగా ఆగస్టు నెలలో యూరియాకు రైతుల నుంచి మరింత డిమాండ్ పెరుగుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు వచ్చిన 10 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రైవేట్ డీలర్లకు 2 వేల మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 1800 మెట్రిక్ టన్నులను సరఫరా చేశారు. ప్రస్తుతం 700 మెట్రిక్ టన్నులు మాత్రమే యూరియా ఉందని అధికారులు చెబుతున్నారు.

నెలకొంటున్న యూరియా కొరత

జిల్లాలో విస్తారంగానే పంటలు సాగవుతున్నాయి. దీంతో రైతులు యూరియా వాడకాన్ని మరింత పెంచేశారు. ప్రస్తుతం గోదాంలలో యూరియా నిల్వలు పూర్తిగా అయిపోయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రాథమిక సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద సైతం అరకొరగానే యూరియా నిల్వలు ఉన్నాయి. చాలా మంది రైతులు ముందస్తుగానే యూరియాను పెద్ద మొత్తంలోనే కొనుగోలు చేసి తరలించేశారు. యూరియా తక్కువ ధర ఉండడంతో రైతుల నుంచి డిమాండ్ ఏర్పడుతోంది. వరి మొక్కజొన్న, శనగ, పొద్దు తిరుగుడు తదితర పప్పు దినుసు పంటల సాగుకు రైతులు

(మిగతా 6వ పేజీలో)



బస్టాండ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా!
- మూగజీవాలకు నిలయంగా రాజంపేట బస్టాండ్
- తాత్కాలిక బస్టాండ్‌లోనూ షెల్టర్ కరువు
- రోడ్డుపై నిల్చుంటున్న ప్రయాణికులు

5

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి
- అన్నారం, కిష్టాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి
- బాన్సువాడ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసిన గ్రామస్థులు

5

కాలభైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు
- హోమం నిర్వహించిన పండితులు
- భక్తులకు అన్నదాన కార్యక్రమం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



గణనీయంగా తగ్గిన రోడ్డు ప్రమాదాలు

- ఆరు నెలల్లో తగ్గిన ప్రమాదాలు
- పార్థిగ్యాంగ్ పట్టివేత
- నిందితులకు జైలు శిక్ష
- ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రత చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలు ఫలితంగా ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గత సంవత్సరంతో పోలిస్తే ఈ 6 నెలల కాలంలో గణనీయంగా తగ్గిందని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2024లో 317 రోడ్డు ప్రమాదాలు జరుగగా 2025లో 282కు తగ్గించగలిగామని తెలిపారు. మరణాల కేసులు 152 నుంచి 120కి అనగా 21 శాతం తగ్గుదల, మరణించిన వారి సంఖ్య 160 నుంచి 125కి అనగా 22 శాతం తగ్గుదల ఉందని తెలిపారు. ఈ గణంకాలు రోడ్డు ప్రమాదాలను తగ్గించి వెలకట్టలేని విలువైన ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రతిరోజూ వాహన తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్, లైసెన్స్ లేని వారిని, అతివేగంగా ప్రయాణించే వారిని గుర్తించి చలానాలు వేయడం వల్ల సాధ్యమయ్యాయని ఎస్పీ తెలిపారు. 75,169 లైసెన్స్ లేని వారు, అతివేగంగా 43,348, విత్ అవుట్ హెల్మెట్ 16,340, డ్రంకెన్‌డ్రైవ్ 5,942 చలానాలు వేశామన్నారు. 28 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. అదేవిధంగా వరకట్నపు కేసులు 174 నుంచి 167కు తగ్గాయి

తగ్గిన దొంగతనాలు

దొంగతనం కేసులు గత సంవత్సరం 259 కాగా ఈ సంవత్సరంలో 214 అయి 17 శాతం తగ్గించామని తెలిపారు. 11 మంది సభ్యులు ఒక ముఠాగా ఏర్పడిన పార్థిగ్యాంగ్ రాత్రి సమయాల్లో జాతీయ రహదారులపై ఆగి ఉన్న వాహనదారులను లక్ష్యంగా చేసుకుని వాహనాల అద్దాలను పగులగొట్టి డబ్బులు, మొబైల్ ఫోన్‌లను దొంగిలిస్తున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితులకు 6 కేసులలో జీవిత ఖైదీ శిక్షలు, 12 కేసులలో 7 సంవత్సరాలలోపు శిక్షలు పడ్డాయి. ఇలా నేరాలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా ఖచ్చితంగా శిక్షలు పడే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిపూర్ణంగా వాడుకోవడంతో పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సెల్ ఫోన్ల రికవరీ

సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఇప్పటి వరకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లు 3,265, సుమారు రూ.7 కోట్ల విలువ గల వాటిని రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. గత 6 నెలల కాలంలోనే 452 రికవరీ చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయిలో కమిషనరేట్‌లో కాకుండా జిల్లాల పని తీరులో మన జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు.

కారుణ్య నియామకాలు.. కొత్త లోగో ఆవిష్కరణ

గాంధారి పోలీసుస్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వడ్ల రవి భార్య సౌఖ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రమేష్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమార్తె మానసలకు కారుణ్య నియామకాల్లో భాగంలో 2 నెలలలోపే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను అందించామన్నారు. హోంగార్డుల నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు 192 మంది సిబ్బందికి కౌన్సెలింగ్ చేసి స్పౌజ్, సీనియార్టి, హెల్త్‌గ్రౌండ్స్ పరిగణలోకి తీసుకుని బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. ఫీయర్‌లెస్ ఆల్‌వెస్, విజిలెంట్ ఫర్ ఎవర్ అనే నినాదంతో జిల్లా పోలీసుశాఖ లోగోను ఆవిష్కరించినట్లు తెలిపారు. డయల్ 100కు 22102 కాల్స్ రాగా 137 కేసులు నమోదు చేయగా మిగితావి సామరస్యంగా, వివిధ విధాలుగా పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి.. మంచి కార్యకర్తలుగా పేరు తెచ్చుకోండి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో జరిగిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, షబ్బీర్‌అలీ, సురేష్ షెట్కార్, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు

డిచ్‌పల్లి, జులై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూపు రాజకీయలను పక్కన పెట్టి మంచి కార్యకర్తలుగా పేరు తెచ్చుకోవాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ శివారులో గల ఈవీఎం గార్డెన్‌లో నిర్వహించిన నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థాయి కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిధులు, నియామకాలు, అని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ నిధులను కేసీఆర్ కుటుంబ సభ్యులు తరలించుకపోతే, నీళ్లను కేసీఆర్ ఫాం హౌజ్‌కు తరలించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ వరి వేస్తే ఉరి అని రైతులను ఎద్దేవా చేశాడని కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు రూ.500 అదనంగా బోనస్ ఇస్తుందన్నారు. ఈ నెల 4న ఎల్బీ స్టేడియంలో జరిగే సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని సీతక్క పిలుపు నిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గె హాజరువుతున్నట్లు ఆమె తెలిపారు. ఓ తల్లి బిడ్డలా మనమంతా కలిసి పని చేసి కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో కేవలం 93వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసి సగానికి పైగా బిల్లులు పెండింగ్‌లో ఉంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500ఇళ్లు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుందన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది బీఆర్ఎస్సే..

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

గత పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ సర్వనాశనం చేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. దేశంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఏమి సాధించారని బీజేపీ నాయకులను ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వాడకపోయినా దేశంలో వరి పంట పండించే రాష్ట్రాల్లో తెలంగాణ నెంబర్ 1గా నిలిచిందన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతులకు రైతు భరోసా నిధులు అందించి ఇచ్చిన మాట నిలుపుకుందన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

- జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల స్థితిగతులను తెలుసుకునేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గె 4న రాష్ట్రానికి వస్తున్నారని ఈ సభను నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కలిసి విజయవంతం చేయాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ముఖ్య నాయకులను పెద్ద సంఖ్యలో తరలిస్తామన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ- ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకులను కోరారు. రాబోవు ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, తాహెర్‌బిన్ హందాన్, అన్వేశ్‌రెడ్డి, కేశ వేణు, నాయకులు అరికెల నర్సారెడ్డి, సునీల్ రెడ్డి, నాగేశ్‌రెడ్డి, ఎనుగు రవీందర్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, శ్రీనివాస్, ముప్ప గంగారెడ్డి, అకుల లలిత, తారాచంద్ నాయక్, రాంబోపాల్, మునిపల్లి సాయిరెడ్డి, వినయ్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నిజాంసాగర్‌లో చిరు చేప పిల్లల ఉత్పత్తి

- ఏడాదికి ఐదు లక్షల చేప పిల్లల ఉత్పత్తే లక్ష్యం

నిజాంసాగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఏడాదికి ఐదు లక్షల చిరు చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని 35 చేప పిల్లల నర్సరీలు ఉండగా వాటిలోనూ ఐదు నర్సరీలను మత్స్యశాఖ అధికార యంత్రాంగం మంగళవారం మరమ్మతులు మొదలు పెట్టారు. ఈ ఉత్పత్తి కేంద్రంలో నర్సరీలు పనికి రాకుండా ఉన్నప్పటికీ జిల్లా మత్స్యశాఖ అధికారులు నిజాంసాగర్‌లో చిరు చేప పిల్లలను ఉత్పత్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కేంద్రానికి తల్లి చేపలను సేకరించి నర్సరీలో ఉంచి బ్రో ఉత్పత్తి ద్వారా స్పాన్ సేకరించి చిరు చేప పిల్లలను ఉత్పత్తి చేస్తామని ఎఫ్‌డీవో డోల్‌సింగ్ తెలిపారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి చేసిన చేప పిల్లలను జిల్లా అధికారుల ఆదేశం మేరకు జిల్లాలో ఉన్న మత్స్యకారుల సంఘాల ఆధీనంలో ఉన్న చెరువులకు అందజేయనున్నారు.



చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో భారీ వర్షం

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- నెలరోజుల తర్వాత వర్షాలు కురువడంతో రైతుల్లో ఆనందం
- పంటల సాగులో రైతులు బిజీబిజీ



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

కామారెడ్డి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజుల నుంచి మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో జిలా వ్యాప్తంగా 25 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గాంధారి మండలంలో 28.3 మి.మీ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం పడడంతో ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పాల్వంచ మండలం ఇసాయిపేటలో 25.8, మాచారెడ్డి మండలం లచ్చపేట, భిక్కనూరులలో 27.3, కామారెడ్డిలో 21.0, రామారెడ్డిలో 21.8, లింగంపేట 18.3, జుక్కల్ 17.5, రాజంపేట మండలం ఆర్గోండ 16.5, దోమకొండ, బీబీపేట 14, బాన్సువాడ 12.3, బిచ్కుంద 11 మి.మీల వర్షపాతం నమోదైంది. ఈ వర్షకాలం సీజన్‌లో జూన్ మొదటి నుంచి ఇప్పటి వరకు అంతంత మాత్రంగానే వర్షాలు పడగా ప్రస్తుతం జిల్లాలోని ఆయా మండలాల్లో సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదవుతుంది.

పంటల సాగులో రైతులు బిజీ బిజీ

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఆరుతడి పంటలను రైతులు ఇప్పటికే సాగు చేస్తున్నారు. పత్తి,సోయా, మొక్కజొన్న, కంది లాంటి ఆరుతడి పంటలను సాగు చేసేందుకు రైతులు విత్తనాలు విత్తడమే కాకుండా కలుపు తీత ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నస్రూల్లాబాద్, తాడ్వాయి, గాంధారి, సదాశివనగర్ తదితర మండలాల్లో సోయా, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా జిల్లాలో ప్రధానంగా రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. వరి పంట సాగుకు దుక్కులు దున్ని నారుమళ్లను సిద్ధం చేశారు. బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, నస్రూల్లాబాద్‌లోని కొన్ని గ్రామాల్లో వరి నాట్లు సైతం పడ్డాయి.



గాంధారిలో..

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని వార్డు నెంబర్ 6తో పాటు తదితర వార్డులను ఆయన సందర్శించారు. ఇందిరమ్మ పథకానికి అనుగుణంగా మంజూరైన ఇళ్ల నిర్మాణ స్థితిని సబ్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పథకంలో నిధుల విడుదల విధానం గురించి స్పష్టంగా లబ్ధిదారులకు వివరించారు. నిర్మాణం ప్రతి దశ పూర్తయిన తర్వాత సంబంధిత మార్గదర్శకాల ప్రకారం మంజూరైన మొత్తం దశల వారిగా విడుదల చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈతో పాటు అధికారులు, మాజీ కౌన్సిలర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



బస్వాపూర్‌లో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూలై 01(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన యువకుడు ఒంటెద్దు శేఖర్ కుటుంబానికి తాము అండగా ఉంటామని బస్వాపూర్ యూత్ ఫర్ యూనిటీ ప్రతినిధులు అన్నారు. మంగళవారం యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.24వేల నగదు, నెలకు సరిపడా వంట సామాగ్రిని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ ఫర్ యూనిటీ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని గ్రామంలో ఎవరు ఇబ్బందుల్లో ఉన్న తాము అండగా ఉంటామన్నారు. ప్రతిఒక్క ద్విచక్రవాహనదారుడు ముఖ్యంగా యువత తప్పకుండా బైక్‌పై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని, అతి వేగం మానుకోవాలని కోరారు. నిబంధనలు పాటించకుండా వాహనాలను నడిపి ప్రమాదానికి గురై కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చవద్దన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యూనిటీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం



కోటగిరిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కోటగిరి,జూలై1(ఆంధ్రజ్యోతి): కోటగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. రోగులకు పండ్లను పంపిణీ చేశారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని కోటగిరి వైద్యాధికారి సుప్రియను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, హన్మంత్ రావు, శ్రీనివాస్, నిశాంత్, అనిల్, ఉదయ్ భాస్కర్, కూచి సిద్దు, బీర్కూర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి ఏడు రోజుల జైలు

నవీపేట,జూలై1(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగేపూర్‌కు చెందిన పండనోళ్ల రాజు ఇటీవల మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపగా డ్రంకెన్‌డ్రైవ్‌లో అతనిని పట్టుకోవడం జరిగిందని ఎస్సై వినయ్ తెలిపారు. సోమవారం రాజును కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఏడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

భీమ్‌గల్, జూలై,1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను ప్రతి ఒక్క కార్మికురాలు హాజరై విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రాజెక్ట్ పరిధిలోని ఆయా విభాగాల కార్మికులు, అంగన్‌వాడి టీచర్లతో సమావేశం నిర్వహించారు.సమ్మెను విజయవంతం చేయటా నికి సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ప్రమీల, కోకన్వీనర్‌గా లావణ్య, సభ్యులుగా గంగాలక్ష్మీ, ఓంకార్, లావణ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీ జిల్లా నాయకుడు రమేష్ బాబు, అంగన్‌వాడి యూనియన్ నాయకులు జ్యోతి, భాగ్య, అనురాధ,సమత, సంధ్య, ఆశావర్కర్లు హేమలత, లక్ష్మీ, లత, తదితరులు పాల్గొన్నారు.

దాబా హోటళ్లలో మద్యం తాగడం నిషేధం

పెద్దకొడప్‌గల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధిలో గల దాబా హోటళ్లలో మద్యం తాగడం నిషేధిస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. 161వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దాబా హోటళ్లతో పాటు మండల పరిధిలో గల ఇతర దాబాలలో వాటి యజమానులు మద్య నిషేధం జరిగేలా చూసుకోవాలని ఆదేశించారు. దాబాలలో మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాబాలు నిర్వహిస్తున్న వాటి యజమానులను మంగళవారం తహసీల్దార్ దశరథ్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, దీంతో పాటుగానే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలని సూచించారు.

అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జుక్కల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్‌లో అంటూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం జుక్కల్ మండలం బంగారు పల్లి గ్రామంలో వైద్య శిబిరంను సందర్శించి అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మురుగునీరు వెళ్లేలా చూడాలని ఆయన పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. దోమలు కుట్టకుండా పలు జాగ్రత్త పాటించాలని ఆయన తెలిపారు.

17 వేల ఉచిత పుస్తకాలు పంపిణీ

జుక్కల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 17 వేల ఉచిత పుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి తిరుపతయ్య పేర్కొన్నారు. మండలంలో 20 వేల పుస్తకాలు ప్రతిపాదనలు పంపగా అధికారులు 17 వేల పంపించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా పుస్తకాలు రావాల్సి ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని ఆయన అన్నారు.



ఆర్మూర్‌లో వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం



జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డాక్టర్లను సన్మానిస్తున్న నివేదన్ గుజరాతి



నవీపేట సీఎస్‌సీలో డాక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా అంతటా ఘనంగా డాక్టర్స్ డే

ఆర్మూర్ టౌన్, జూలై,1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు ప్రమిదారెడ్డి, అమృతరాంరెడ్డి, అజయ్, స్రవంతి రెడ్డి, స్నేహ, అపర్ణ, గీత, పల్లవి, దీక్షిత, దీప్తి, సతీష్, ప్రవీణ్‌కుమార్, రాజేష్‌లను పట్టుశాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు ఆకుల రాజు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి గోపి కృష్ణ, సభ్యులు చేపూర్ గణేష్, గుజరాతి నివేదన్, పోల్కం వేణు, రామకృష్ణ, ప్రకాశ్, రాజేశ్, సంతోష్‌కుమార్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ..

పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులకు, చార్టెడ్ అకౌంటెంట్‌లను పట్టుశాలువతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ గుజరాతి సభ్యులు బేల్దారి శ్రీనివాస్, బీజే దయానంద్, సునీల్, దొండి నారాయణ వర్మ, కాశినాద్, దుర్గప్రసాద్, కోలుశేఖర్, కరణ్, పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ..

పట్టణంలోని డాక్టర్స్‌డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వ ర్యంలో పలువురు డాక్టర్లను పట్టుశాలువ, మెమెంటోలతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు మ్యాక శ్రీకాంత్, కార్యదర్శి సీహెచ్ నారాయణరావు, కోశాధికారి గుర్రం విజయానంద్, చెరుకు పృథ్వీరాజ్, మోహన్‌దాస్, శశికాంత్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● అఖిలపక్షం ఆధ్వర్యంలో ..

పట్టణంలోని డాక్టర్స్ డే సందర్భంగా అఖిల పక్షం ఆధ్వర్యంలో ప్రముఖ డాక్టర్లను అఖిలపక్షం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా 35 ఏళ్లుగా ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్న డాక్టర్ మధుశేఖర్‌ను పట్టుశాలవ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారం బాలు, సర్వసమాజ్ అధ్యక్షుడు మందుల బాలు, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్మే నవీన్, మాజీ సర్వసమాజ్ అధ్యక్షుడు గుండేడి మహేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మీసాల రవి, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జన్నపల్లి రంజీత్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గుంజాలపృథ్వీ, తెడ్డు రాజు, ఉదయ్,ఉమార్ పాల్గొన్నారు.

కోటగిరి:కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం అభయహస్తం సొసైటీ, భవానీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని వ్యవసాయ మహిళ రైతు కూలీలకు అల్పాహారం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, అభయ హస్తం ఫౌండేషన్ నిర్వాహకులు బర్ల మధు, మండల కార్యదర్శి విఠల్ గౌడ్, భవానీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ గౌడ్, సాయిబాబా, మధు, శ్రీనివాస్, నరేందర్, విజయ్, శ్రీకాంత్, ప్రవీణ్, శివరాజ్ పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్లను శాలువా, పూలమాలతో సన్మానించారు. రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కావ్య, ప్రవళిక, సామ్రాట్ యాదవ్, అరవింద్, సూపర్‌వైజర్ కిషన్, మమత, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వెదేఎత్యురాలు డాక్టర్ బాలి స్పందన ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంపిణిచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నేటి సమాజంలో వైద్యు పాత్ర అనే అంశంపై పలువురు వైద్యసిబ్బంది ప్రసంగిస్తు వైద్యుల సేవలను కొనియాడారు. అనంతరం అసుపత్రి వైద్యురాలు బాలిస్పందనను శావాలువతో



చౌట్‌పల్లిలో కేక్‌కట్ చేస్తున్న వైద్య సిబ్బంది



బీర్కూర్‌లో..

ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తీరణ అధికారి సత్యనారాయణ, ఆరోగ్య పసర్యవేక్షకురాలు స్వరూప ఫార్మసిస్టు అరుణ్, డిఇవో మధు, అసుపత్రి పరిది గ్రామాల వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులను సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారికి మెమోంటోలను అందజేశారు. ఇదిలా ఉండగా లయన్స్ క్లబ్ వారు డాక్టర్స్ డే సందర్భంగా బీర్కూర్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మతి స్థిమి తం లేని వారికి, పేద వారికి అన్నం పొట్లాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ రవీందర్ జెట్టి, ట్రెజరర్ మేకల గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పెళ్లికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కొండంత అండ : ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచుల పెళ్లికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కొండంత అండ అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలో సాలూర మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల పెళ్లికికల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంద్వారా రూ.1,00116 అందజేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల తహసీల్దార్ శశిభూషణ్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, అల్లె రమేష్, పాటు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బోధన్‌రూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మైనారిటీ అధ్యక్షులు అబీద్ సోఫీ అడ్వకేట్ తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన అబీద్ సోఫీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, అందుకే మైనారిటీ సోదరులు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థగత ఎన్నికలలో మైనారిటీల ఓట్లు కాంగ్రెస్ పార్టీకే పడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, మరి కొందరు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మాజీ కౌన్సిలర్లు శరత్ రెడ్డి, దామోదర్, అరికెల నర్సారెడ్డి, పులి శ్రీనివాస్, తలారి నవీన్ తదితరులున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

● ఏఐటీయూసీ జిల్లా విఠల్ గౌడ్

కోటగిరి,జూలై1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కోటగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11సంవత్సరాలు కావచ్చిన ఇప్పటి వరకు కార్మిక సంక్షేమ బోర్డును నిర్వహించలేకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని 8గంటల పని స్థానంలో 12గంటలు పని చేసేలా ఆదేశాలు జారీ చేస్తుండడం సిగ్గుచేటన్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, గంగాదర్, హన్మాండ్లు, శివరాజ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జూలై 01, 2025-26 లయనిస్టిక్ ఇయర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రీజన్ చైర్‌పర్సన్ అనిత బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా రీజన్ చైర్ పర్సన్ అనిత మాట్లాడుతూ..ప్రతీ సంవత్సరం జూలై నెల నుంచి లయనిస్టిక్ ప్రారంభం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యా యులు కిషోర్‌సింగ్, నాగనాథ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ నిర్మాణం సరే..సైడ్ బరముల సంగతి ఎంటీ?

నిజాంసాగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద లక్షల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్ నిర్మాణం చేశారు. కానీ రోడ్డు కిరువైపులా సైడ్ బరములు మట్టిని వేయాలని ఆలోచన లేకపోవడంతో రహదారి వెంటనే వెళ్లే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని అచ్చంపేట రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు పాత బస్టాండ్ నుంచి వెళ్లే రహదారికి దాదాపు కిలోమీటర్ దూరం గల రహదారిని దాదాపు రూ.60 లక్షల వ్యయంతో సీసీరోడ్ నిర్మాణాన్ని నాలుగు నెలల కిందట పూర్తి చేశారు. పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు రహదారికి ఇరు వైపులా సైడ్ బరంలో మట్టిని వేయలేక పోయిన పనులను పర్యవేక్షించిన ఇంజ నీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి కిరువైపులా ఉన్న సైడ్ బరములు మట్టిని వేయించాలని కోరుతున్నారు.



బీసీ హాస్టల్ నుంచి సుల్తాన్‌నగర్ రోడ్డుకు కొంత మేరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టిన దృశ్యం

మంత్రి సీతక్కను సన్మానించిన నాయకులు



మంత్రి సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

భీమ్‌గల్, జూలై,1 (ఆంధ్రజ్యోతి)జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్కను మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన పార్లమెంట్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన సందర్భంగా మండల అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో మంత్రిని సన్మానిం చారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, అనంతరావు, కుంట రమేష్, కన్న సురేందర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆర్మూర్‌టౌన్, జూలై,1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కాంతి హైస్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. మంగళవారం లయన్స్ క్లబ్ శుభారంభ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లతో పాటు మెమెంటోలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేక శ్రీకాంత్, కార్యదర్శి నారాయణగౌడ్, గుర్రం విజయానంద్,చెరుకుపృథ్వీరాజ్,చంద్రశేఖర్,శశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

తగిలేపల్లిలో మత్తడి పోచమ్మ బోనాలు

వర్ని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో మంగళవారం మత్తడి పోచమ్మతల్లి పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తి గ్రామ శివారులో గల మత్తడి పోచమ్మ ఆలయానికి, భజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలో కొలువు దీరిన మత్తడి పోచమ్మ తల్లి వస్త్రారణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏడాది పాటు పిల్లా, పాపలతో తమ కుటుంబాలు చల్లగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు. అన్ని కులాల వారు విందు భోజనాలు చేశారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బోలేరో వాహనం

బోధన్‌రూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులోని పాండు ఫారంలో మంగళవారం మధ్యాహ్నం మద్యం తీసుకెళ్తున్న బోలేరో వాహనం పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బోలేరో వాహనం పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. విషయం తెలుసుకున్న పోలీసులు,అగ్ని మాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. బోలేరో వాహనాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

సిగాసీ ఫ్యాక్టరీ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

జక్రాన్‌పల్లి, జూలై,1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మున్సిపాలిటి పరిధిలోని పాసం మైలారం లోని సిగాసీ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాని దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పంచాయితీ కార్మికులు గంగాధర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

బాల్కొండ, జూలై,1 (ఆంధ్రజ్యోతి): బాల్కొండలోని కస్తూర్బా పాఠశాలను అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటసరుకులు, బోజన వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని నాగాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీధర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఈరవత్రి అనిల్ పరామర్శ



బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ఈరవత్రి అనిల్

ఏర్గట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బాధిత కుటుంబాలను మం గళవారం టీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. అందులో భాగంగా తడపాకల్ గ్రామానికి చెందిన జింక అనిల్ తండ్రి మృతి చెందగా వారి కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిట్ల మీణ కుటుంబాన్ని, దోంచంద గ్రామానికి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మాజీ జడ్పిటీసి గుల్లె రాజేశ్వర్, రవి రెడ్డి, రేండ్ల రమేష్, మునీర్, సుంకేట రవి, ముత్యం రెడ్డి, సుంకేట శ్రీనివాస్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

హున్సాలో ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని హున్స గ్రామంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలు పోచమ్మ, మహలక్ష్మి ఆలయాలకు ప్రతి ఇంటి నుండి మహిళలు డప్పువాయిద్యాలతో బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి ఒడిబియ్యం నింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, పాడిపంటలు బాగుండాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులున్నారు.

అంకాపూర్ ఆశ్రమంలో అన్నదానం

ఆర్మూర్ రూరల్, జూలై,1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ప్రొద్దుటూరి సదానందరెడ్డి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జి. రాజన్న జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుబాయి రాజన్న, రాజారెడ్డి, గంగాదేవి యూత్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, రాజేశ్, రాజలింగం, గంగారెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు మిసిమి విద్యార్థి

కమ్మర్‌పల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి అండర్ 19 క్రికెట్ పోటీలకు కమ్మర్‌పల్లి మిసిమి ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న ఉప్లూర్ గ్రామానికి చెందిన యెనుగందుల సౌమిత్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయి నట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు ఈ మెరకు పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయిన విద్యార్థి సౌమిత్ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు సంజీవ్‌ను పాఠశాల కరస్పాండెంట్ బాలి రవిందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వర్ని,జూలై1(ఆంధ్రజ్యోతి): వర్నిలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. శంబారంగ్‌లో భా గంగా అధ్యక్షుడు అతిమెల నగేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. హరిత హారంలో భాగంగా పండ్ల, కొబ్బరి చెట్లు నాటారు. నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



నిరుపయోగంగా ఉన్న రాజంపేట బస్టాండ్

బస్టాండ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా!

- మూగజీవాలకు నిలయంగా రాజంపేట బస్టాండ్
- తాత్కాలిక బస్టాండ్‌లోనూ షెల్టర్ కరువు
- రోడ్డుపై నిలుచుంటున్న ప్రయాణికులు

రాజంపేట,జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మూగజీవాలకు నిలయంగా మారింది. మండల కేంద్రంలోనిచౌరస్తాలో రోడ్డుపై ఎండా, వానకు ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూడాల్సి వస్తోంది. కామారెడ్డి-మెదక్ జిల్లాలకు మండలం మీదుగా బస్సులు ప్రయాణిస్తుంటాయి. నిత్యం వందల మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో బస్టాండ్ ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేదు. రోజు వందలాది మంది ప్రయాణించే మార్గంలో బస్టాండ్ ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిరుపయోగంగా ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా మార్పు మాత్రం రావడం లేదని కనీసం బస్టాండ్ అయినా ఉపయోగంలోకి తెచ్చి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరుతున్నారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

మండలకేంద్రం చౌరస్తాలో మరుగుదొడ్డి సౌకర్యాలు లేక బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు ఒంటికి, రెంటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారితో పాటు ప్రయాణించే ప్రయాణికుల కోసం మండల కేంద్రం చౌరస్తాలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ప్రయాణికులు కోరుతున్నారు.


బస్టాండ్ ప్రాంతంలో గుంతల మయమైన రోడ్డు


రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురికినీరు

ఎటు చూసినా గుంతలే!


వర్షపు నీటితో నిండిన గుంతలు

- పేరుకే భీమ్‌గల్ మున్సిపాలిటీ • అస్తవ్యస్తంగా రోడ్లు, మురికి కాల్వలు • చిరుజల్లులకే చిత్తడవుతున్న పట్టణ రోడ్లు • నడవడానికి ప్రజలకు ఇబ్బందులు

భీమ్‌గల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు నిండా నిధులు ఉన్నా.. మున్సిపల్ కేంద్రమైన భీమ్‌గల్ పట్టణం అభివృద్ధి పనులకు నోచుకోలేకపోతోంది. భీమ్‌గల్ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. గ్రామ పంచాయతీగా ఉన్న భీమ్‌గల్ మున్సిపాలిటీగా మారడంతో ఎంతో అభివృద్ధి జరుగుతుందన్న అనుకున్న ప్రజల ఆశలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే నిలిచిపోయాయి. నూతన పురపాలక పట్టణానికి కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పుకునే నాయకుల మాటలు మూటలుగానే మిగిలిపోతున్నాయని అనడానికి పట్టణ కేంద్రంలోని వార్డులలోని రోడ్లు, మురికి కాలువలు చూస్తే అర్థమవుతోంది.

కాగితాల్లోనే ఖర్చులు.. పనులు శూన్యం

పట్టణ కేంద్రంలోని 12వ వార్డుల్లో గుంతలు, గతుకుల రోడ్లలో మొరం పోసేందుకు భారీగానే నిధులను ఖర్చు చేసినట్లు అధికారులు ఖర్చులో లెక్కలు చూయిస్తున్నారు. కానీ ఒకటి రెండు వార్డులలో తప్ప ఏ ఒక్క వార్డులలో సరైన పనులైన దాఖాలాలు కనిపించడం లేదు. నందిగల్లీలో నిత్యం వందల మంది నడిచే రోడ్డు చిన్న వర్షం పడిందంటే నీరు రోడ్డుపై నిలిచి బురదమయంగా మారుతుంది. పైగా ఈ నీటిపై దోమలు నిల్వ ఉండడంతో ఈ ఇబ్బందులు కూడా కాలనీవాసులకు తప్పడం లేదు. అలాగే నాలుగో వార్డులో గతంలో ఉన్న ప్రధాన రోడ్లన్నీ కంకర తేలి గుంతలమయంగా మారింది. ఇదే రోడ్డు వెంబడి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. అన్ని ఇబ్బందులూ కళ్ల ఎదుటే ఉండగా రోడ్లకు నిధులు ఇక్కడ ఖర్చు చేశారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి అంగడి బజార్ వరకు గల రోడ్డుపై కంకర తేలి వర్షం నీటితో గుంతలమయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం వెనుక కాలనీలో రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. కానీ ఏ ఒక్క నాయకుడు కానీ, అధికారి గాని ఈ రోడ్డును పట్టించుకోవడం లేదు.

రోడ్డుపై మురికి నీరు

పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు విన్నవిస్తే తాత్కాలికంగా పనులు చేపడుతున్నారు. కానీ శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే నివాస గృహాల మధ్య వర్షపు నీరు, మురికి నీరు నిల్వ ఉండి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గత ఎనిమిది నెలలుగా అంగడిబజార్ ప్రాంతంలో హనుమాన్ ఆలయం ముందు డ్రైనేజీపై ఏర్పడ్డ గుంతను మరమ్మత్తు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు.

నిధుల దుర్వినియోగమనే ఆరోపణలపై విచారణ ఏది?

భీమ్‌గల్ మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేయడం లేదని, చేస్తే నిధులు దుర్వినియోగం అయ్యాయా లేక పనులు జరిగాయా అనే ప్రశ్నలు ప్రజలు నుంచి విన్పిస్తున్నాయి.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతాం

- గోపు గంగాధర్, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్

భీమ్‌గల్ మున్సిపాలిటీలో అన్నివార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలకు రూ.11కోట్ల 50 లక్షల పనులు టెండర్ దశలో ఉన్నాయి. వాటితో 12 వార్డులలో రోడ్ల మరమ్మతు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతాం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అధికారులను అందుబాటులో ఉంచుతున్నాం. పట్టణంలో ఎక్కడైనా ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తున్నాం.


బస్‌డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

బీర్కూర్, జూలై1 (ఆంధ్రజ్యోతి): అన్నారం, కిష్టాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామాలకు చెందిన స్థానిక నాయకులు మంగళవారం బాన్సువాడ బస్సుడిపో అసిస్టెంట్స్ మేనేజర్ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నారం, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 60మంది విద్యార్థులు బీర్కూర్‌లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రతీ రోజు బస్సులో వెళ్లి వస్తున్నారన్నారు. అయితే బస్సు వేళకు రాకపోవడంతో విద్యార్థులు బడికి చేరుకోవడానికి ఆలస్యం అవుతుందన్నారు. దీంతో విద్యార్థులు ప్రతీ రోజు క్లాస్ ఆలస్యమవుతున్నారని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8.40 గంటలకు చించోలి గ్రామానికి బస్సు వచ్చి తిరిగి బాన్సువాడకు వెళుతుందని, ఇదే బస్సు బీర్కూర్ వరకు వెళ్లేలా చర్యలు తీసుకుంటే విద్యార్థుల కష్టాలు తీరుతాయని కోరారు. ఇందులో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ బాబు రావు, అన్నారం, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

లింగంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ పరిధిలో మంగళవారం 900 యూరియా బస్తాలు నిల్వ ఉన్నాయని వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు సీఈవో శ్రీనివాస్ తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎరువుల కొరత లేదని చెప్పారు. పొల్కంపేటలో 600 బస్తాలు, శెట్పల్లి సంగారెడ్డిలో 300 బస్తాలు నిల్వ ఉన్నాయని ఆయన తెలియజేశారు. యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు.


స్కూల్ యూనిఫాంను కూడుతున్న తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

- కామారెడ్డి అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

గాంధారి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పొతంగల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలోని ప్లాంటేషన్, సబ్‌సెంటర్‌లను పరిశీలించారు. ఇందిరమ్మ నూతన నిర్మాణాలకు మార్కవుట్ వేయించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి ఏ విధంగా పిల్లలు వస్తున్నారని సమస్యలు ఏమైన ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్నభోజన పథకం పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యబోధన అందించాలని తెలిపారు. గ్రామంలో విద్యార్థులకు ప్రభుత్వం కుట్టిస్తున్న యూనిఫాంలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఓ మురళి,ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మక్కకు కత్తెర పురుగు

- ఆందోళనలో రైతులు

డొంకేశ్వర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు కాటేస్తోంది. దీనితో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డొంకేశ్వర్ మండల పరిధిలో సోయాకు ప్రత్యామ్నాయంగా మక్క పంటను 1850 ఎకరాల్లో సాగుచేశారు. రైతులు అనేక రకాల రసాయన మందులు పిచికారీ చేసిన పంటకు పురుగు ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా మొక్కజొన్న పంటలోనే అధికంగా కత్తెర పురుగు వెంటాడుతోందని రైతులు అంటున్నారు. మక్క పంటలో కాండం తొపలికి పురుగు ప్రవేశించి కాండంలో గుజ్జుతో పాటు ఆకులను కూడా వదలకుండా తినివేయడంతో మక్కపంట ఎదుగుదల లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాకాల సంవత్సరం పంట మొలకెత్తిన నుంచే కత్తెర పురుగు వదలడం లేదు. దీంతో మక్క పంటను వర్షాకాలంలో సాగు చేశారు. ధర మంచిగా ఉందన్న రైతుల ఆశలకు ఆవిరయ్యాయి. వేసినా పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటలు పడుతున్నారు. పంట మొలకెత్తిన నుంచే కత్తెర పురుగు ప్రభావం మొదలవ్వడంతో కొంతమంది రైతులు పురుగు నివారణ కోసం రైతులు మందులను పిచికారీ చేస్తున్నారు. మరికొంత మంది రైతులు గుళికలు వాడుతున్నారు. అయిన కూడా పురుగు ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ పురుగు ఉధృతి కారణంగా దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కత్తెర పురుగు సోకిన మక్కపంట


మక్కపంటకు తెగుళ్ల నివారణకు పురుగు మందు పిచికారీ

సరైన సమయంలో పిచికారీ చేసుకోవాలి

మొక్కజొన్న మొలకెత్తిన సమయం నుంచి 60 రోజుల వరకు పురుగు ప్రభావం ఉంటుంది. కత్తెర పురుగు నివారణ కోసం సరైన సమయంలో రైతులు మందులను పిచికారీ చేసుకోవాలి. లేనిపక్షంలో కత్తెర పురుగు ప్రభావంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతోంది. 15 నుంచి 20 రోజులకు ఒక్కసారి 30 రోజుల నుంచి 45రోజుల వరకు ఒకసారి ఇమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం ఎస్‌జీ 150 గ్రాములు ఎకరానికి లేదా ఇమామెట్టిన్ జెంబోయేట్ 1.5శాతం ఎస్‌జీ, ప్రొపేనోపాస్ 35శాతం డబ్లుడీజీ 300 గ్రాములు ఎకరానికి లేదా స్పైనోటారామ్ 100ఎంఎల్ ఎకరానికి లేదా నోవాలూరన్, ఇమోమెక్టిన్ బెంజోయిట్ లేదా నోవాలూ రన్, ఇండెక్సికార్బ్ 300ఎంఎల్ ఎకరానికి సరైన సమయంలో పిచికారీ చేసి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదదన్ సూచిస్తున్నారు.

రసాయన ఎరువులకు బాగా అవుతోంది

- చిన్నారెడ్డి, రైతు, గాదెపల్లి



మక్క పంటలో కత్తెర పురుగు ప్రభావం ఎక్కువగా ఉంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. రసాయన ఎరువులకు భారీగా ఖర్చు అవుతోంది. మక్కకు మంచి రేటు ఉందని సోయకు బదులుగా 5వ ఎకరాలు మక్క వేశాను. పంట మొలకెత్తిన నుంచి తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ ప్రభావంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక సింధూర పూజలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

రామారెడ్డి, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల భైరవస్వామి ఆలయంలో మంగళవారం సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చారణలతో సంతతధారాభిషేకం, పాలాభిషేకం, సింధూర, ప్రత్యే కపూజలు నిర్వహించారు. ఆలయంలో ఓంఓం భైరవ.. ఓం కాలభైరవ అంటూ ప్రత్యేక పూజలు, పాటలు, హోమం, యజ్ఞం, జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారి విగ్రహాన్ని అలంకరించారు. జిల్లాతోపాటు హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరైన మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులు రూ.8,586లతో తయారు చేసిన దండను స్వామివారికి వేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, ఆలయ మాజీ చైర్మెన్‌లు దోమకొండ శ్రీనివాస్ గుప్తా, గంజి సతీష్ గుప్తా, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయంలో కాలభైరవస్వామి విగ్రహం

- ఆలయంలో పూజలు చేసిన డీఎస్పీ

కాలభైరవ స్వామి ఆలయంలో కామారెడ్డి డీఎస్పీ చైతన్యరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు బజాభజంత్రీలతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధి, ఆలయ విశిష్టత గురించి ఆమెకు పురోహితులు వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి అనంతకాలంలోనే అభివృద్ధికి నోచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ, రామారెడ్డి ఎస్సై రాజారాం, పోలీసులు పవన్, ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీకి మెమోంటో అందజేస్తున్న ఈవో ప్రభు రాంచంద్రం గుప్తా

పశు పోషకులకు అభయమేదీ?

- జిల్లాలో పశుపోషణపై తగ్గుతున్న ఆసక్తి • ప్రకృతి వైపరీత్యాలతో ప్రాణాలు కోల్పోతున్న జీవాలు • బీమా లేక నష్టాలు


రైలు ప్రమాదంలో గాయపడ్డ గేదె

కోటగిరి, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పశుపోషణపై ఆసక్తి తగ్గుతోంది. బీమా పథకాలు ప్రభుత్వం తరపున సరైన తోడ్పటు లేకపోవడమే ఇందుకుకారణం అనే అభిప్రాయం పశుపోషకుల నుంచి వ్యక్తమవుతోంది. అనుకోని ప్రమాదంలో పశువు మృతి చెందితే ఏమీ చేయలేని పరిస్థితి రైతుది. బోధన్ డివిజన్ పరిధిలో గత రెండు నెలల్లో విద్యుదాఘాతం, ప్రకృతి వైపరీత్యాలకు పదుల సంఖ్యలో పశువులు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి. నవీపేట మండలంలో రైలు ప్రమాదంలో సుమారు పదికి పైగా గేదెలు మృతిచెందాయి. రుద్రూరు మండలంలోని రాణంపల్లి గ్రామంలో వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌కు గురై విలువైన గేదెలు మృతి చెందాయి.

- ప్రత్యేక పరిస్థితుల్లోనే..

విద్యుదాఘాతంతో మృతి చెందినప్పుడు మేక, గొర్రెకు 7వేలు, గేదెలు, ఎద్దులకు 40వేల రూపాయల చొప్పున ట్రాన్స్‌కో పరిహారం ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాలు ఇతర సందర్భాలు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే తప్ప పరిహారం అందదు. ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల నిత్యం రైతులకు సంబంధించిన ఎద్దులు, గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు మృతి చెందితే ఇప్పటి వరకు ఏ రైతుకు పరిహారం అందిన దాఖలాలు లేవు. బీమా ఉంటే ప్రమాదాల్లో పశువులు చనిపోతే కనీసం ఆర్థిక భరోసా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

- రుణం తీసుకుని కొనుక్కుంటేనే

ప్రభుత్వం పశువుల బీమా పథకం ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం సంక్షేమ పథకాలలో భాగంగా రాయితీపై అందించే పశువులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, బ్యాంకు లింకేజీ ద్వారా రుణం తీసుకుని పశువులు కొనుగోలు చేస్తే మాత్రమే బీమా వర్తింపజేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు గొర్రెలకు 274 రూపాయలు, పొట్టేలకు 312 రూపాయల చొప్పున ప్రీమియం తీసుకుని బీమా చేస్తున్నాయి. ఏదైనా కారణంతో మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్ట్ తప్పనిసరి. ఒక్కొ గొర్రెల కాపరికి వందలాదిగా గొర్రెలు ఉండడం వల్ల ప్రీమియం చెల్లించడం భారమై వెనుకంజ వేస్తున్నారు. పాడి పశువులకు డెయిరీ యాజమాన్యాలు బీమా కల్పిస్తున్నాయి. ఇది రాష్ట్రమంతా కలిపినా 10శాతం దాటలేదు.


రాణంపల్లిలో విద్యుత్ షాక్‌కు గురైన మృతి చెందిన గేదె

గోపాల మిత్రులకు బీమా సౌకర్యం కల్పించాలి

- కృష్ణ గౌడ్, గోపాల మిత్ర, జాడి

పాడి పరిశ్రమ అభివృద్ధిలో గోపాల మిత్రుల సేవలు నిరంతరం కొనసాగుతున్నాయి. పాడి పశువులకు ప్రమాదాలు, వ్యాధులు సంభవించిన సమయంలో వైద్యం చేసేందుకు వెళ్లే క్రమంలో గోపాలమిత్రలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. గోపాల మిత్రలకు సైతం ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలి.



రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తాం

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్


అడ్లూర్ ఎల్లారెడ్డిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఏవో

సదాశివనగర్, జూలై1(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజీవాడి సహకార సంఘాల్లో యూరియా నిల్వలను రాత్రివరకు తనిఖీ చేశారు. జిల్లాలో యూరియాకు కొదవలేదని రైతులకు సకాలంలో సరిపడా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. కొందరు రైతులు అవసరానికి మించి నిల్వ చేసుకుంటున్నారని దీంతో కొరత ఏర్పడటానికి కారణం అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, చైర్మన్లు, సీఈవోలు ఉన్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని ఏఈవో రాజాగౌడ్ అన్నారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఆజామాబాద్ గ్రామ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని ఏఈవో రాజాగౌడ్ నిర్వహించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని రైతులకు ఆయన సూచించారు. అదేవిధంగా పశు సంపద మేకలు, గేదెలు తదితర వ్యవసాయ అనుబంధ పశువుల పెంపకం గురించి వాటి వల్ల వచ్చే ఆదాయ మార్గాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆజామాబాద్, కళ్యాణి, లింగారెడ్డిపేట్, తిమ్మారెడ్డి గ్రామాల రైతులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అటవీ భూమిని గుర్తించిన అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాణి గ్రామ పరిధిలోని అటవీ భూమి కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనునాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రత్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు రెండు ఎకరాల అటవీ భూమిని ఆక్రమించాలని చూశాడని, ఆక్రమణకు గురైనా అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జేసీబీతో కందకాలు తీసి అటవీ భూమిని పరిరక్షించామని అన్నారు. ఆక్రమణ చేసిన వ్యక్తిపై చట్టప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాలక వర్గం సభ్యులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముగిసిన మహిళా పాలకవర్గం సభ్యుల శిక్షణ

మద్నూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో ఉమ్మడి మద్నూర్ మండల మహిళా సంఘాల పాలక వర్గ సభ్యులకు సెర్ప్ ఆధ్వర్యంలో రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ జంగమ్మ మాట్లాడుతూ రెండు రోజులుగా మహిళా సంఘం పాలకవర్గం సభ్యులకు శిక్షణ ఇచ్చిన విధంగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామ సంఘంలో ఉండే పదాధికారులైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీఆర్పీలు నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుర్జకుంటలో సర్వే చేస్తున్న దృశ్యం

రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలి

భిక్కనూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చేపడుతున్న ఫీల్డ్ సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సునీత అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని గుర్జకుంట, ఇసన్నపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఫీల్డ్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఫీల్డ్ సర్వేలో భాగంగా ఫిర్యాదులు వచ్చిన రైతుల వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఇందుకు రైతులు పూర్తి ఆధారాలతో వచ్చి తమతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రోజ, ఆర్ఐ బాలయ్య, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సంగమేశ్వర్‌లో జనసురక్ష కార్యక్రమానికి హాజరైన గ్రామస్థులు

సంగమేశ్వర్‌లో ప్రభుత్వ పథకాలపై అవగాహన

దోమకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆర్‌బీఐ, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం చంద్రశేఖర్, బ్యాంకు మేనేజర్ హిమబిందు మాట్లాడుతూ పీఎంజేడీవై, పీఎంఎస్ బీవై, ఏపీవై పెన్షన్, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఏపీఎం రాజు, ఎస్ఎస్‌టీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రామ మహిళా సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెన్షన్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి

● మాజీ జడ్పీటీసీ తిరుమలగౌడ్

దోమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పెన్షన్‌దారులకు వారి ఖాతాల్లో పెన్షన్ డబ్బులను ప్రతీనెలా జమ చేయాలని కోరుతూ మంత్రి సీతక్కకు దోమకొండ మాజీ జడ్పీటీసీ తిరుమలగౌడ్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ నివాసంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండలంలో 7291 పెన్షన్లు ఉండగా కేవలం దోమకొండ పట్టణంలోనే 3270 పెన్షన్లు ఉన్నాయని వృద్ధులు, వికలాంగులకు ప్రతీనెల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మూడు రోజుల సమయం కాకుండా వారం రోజుల పాటు పెన్షన్ల పంపిణీకి సమయం కేటాయించాలన్నారు. దోమకొండలో ఇద్దరు సిబ్బందితోనే పెన్షన్ల పంపిణీ జరగడంతో పెన్షన్‌దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి బాధను గమనించి ప్రతీనెలా వారి ఖాతాల్లో పెన్షన్ డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, శ్రీకాంత్, సీతారాం మధు, తదితరులు ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

బీర్కూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు, ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో మహబూబ్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం ఆయన హౌసింగ్ ఏఈ హన్మంత్‌తో కలిసి అన్నారు. కిష్టాపూర్ గ్రామాలలో పర్యటించి ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కిష్టాపూర్ గ్రామంలో 19 ఇళ్లకు మార్కౌట్ ఇచ్చారు. ఏడు ఇళ్లకు సంబంధించి పునాది లెవల్ ఫోటోలను ఇందిరమ్మ స్కీం యాప్‌లో నమోదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదా రులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్, హౌసింగ్ ఏఈ హనుమంతు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక దయానంద్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి గ్రామంలో నుతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు లబ్ధిదారు త్వరగా చేపడితే విడుతల వారీగా లబ్ధిదారులకు బిల్లులను అందజేస్తామని ఆయన తెలిపారు. బొమ్మన్ దేవ్ పల్లి గ్రామానికి 28 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయితే, 8 మంది లబ్ధిదారులు మార్కౌట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, గ్రామపంచాయతీ సెక్రెటరీ, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో గల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కమిటీ సభ్యులు తమ గ్రామాలలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. మంగళవారం మండలంలోని వడ్లం, కాస్లాబాద్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణ తీరుతెన్నులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు నిర్మాణం చేసుకునే వారు కొలతల ప్రకారం ఇండ్లు నిర్మించుకుంటే వారి ఖాతాలలో డబ్బులు విడతల వారీగా జమ చేస్తామని తెలిపారు. ఇండ్ల నిర్మాణం ప్రారంభించని వారు తొందరగా ఇండ్లు నిర్మాణం మొదలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: తిమ్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో ప్రకాష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో మొదటి విడతలో ఎంపికైనా లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులను ప్రభుత్వ నిబంధనల మేరకే చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. సకాలంలో బిల్లులు అందిం చడానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జ్యోతి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వగ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మండల ప్రత్యేకాధికారి అరుణ, ఎంపీడీఓ అనితరెడ్డిలు పరిశీలించారు. వీరి వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ

మంత్రి సీతక్కను సన్మానించిన నాయకులు



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న దృశ్యం.

భిక్కనూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ఇంచార్జి మంత్రిసీతక్కకు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని భిక్కనూరు మండలకాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రితో పాటుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జును టీపీసీసీ ప్రధానకార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపరి భీంరెడ్డి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ మేరకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులకు మంత్రి దిశానిర్దేశం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, మాజీ ఎంపీపీరేఖ, రాజు, నాయకులు పాల్గొన్నారు.

దోమకొండ: గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మంగళవారం దోమకొండ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు షబ్బీర్‌అలీ నివాసంలో మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకా ంత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

రామారెడ్డి: రాష్ట్ర పంచాయతిరాజ్ మంత్రి ధనసారి సీతక్క ను మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నేతృత్వంలో రామారెడ్డి మండల కాంగ్రెస్ నేతలు, నాయకులు, యువజన నాయకులు కలిసి శాలువా కప్పి మెమోంటో అందజేశారు.ఈ కార్యక్రమంలో రామారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామల శీలాసాగర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పిప్పరి గణేష్, మండలనేతలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవంతో సమానం

● ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజమౌళి

భిక్కనూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రత్యక్ష దైవంతో సమానమని ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారి పురం రాజమౌళి అన్నారు. మంగళవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి యేమిమా, దివ్య, వెంకటేశ్వర్లును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి చల్లా లక్ష్మణ్, కోశాధికారి వెంకటేశం, ప్రతినిధులు తాటికొండ కృష్ణమూర్తి, బంక్ శ్రీనివాస్,కిరణ్, హెచ్ఈవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివనగర్: సమాజానికి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు దైవంతో సమానమని, గ్రామీణప్రాంతంలో ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్లు కూడా గ్రామాల్లో ప్రజలకు నిరంతరం సేవలను అందిస్తూ కష్టపడుతున్నారని మానవ హక్కుల సంఘం రాష్ట్ర చైర్మన్ సలీం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి, అడ్వకేట్ శ్రీనివాసరావు, శ్రీమాన్ స్వామి, కుమ్మరి శ్రీను, సాదిక్‌అలీ, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ దంపతుల మృతి

రాజంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామంలో పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యయత్నం చేసిన భార్యభర్తలు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. లింగంపేట మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన చాకలి గంగారాం(35) ఆయన భార్య సుజాత(30)లు శివాయిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రావు పంట పొలంలో జీతం ఉన్నట్లు తెలిపారు. భార్యభర్తల మధ్య గొడవలు రావడంతో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించినట్లు స్థానికులు తెలిపారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైనికుడిగా సేవలు అందించడం మహాభాగ్యం

బిచ్కుంద, జూలై 1(ఆంధ్రజ్యోతి): భారతదేశ రక్షణ కోసం సైనికుడిగా సేవలందించడం ఎంతో గొప్ప మహాభాగ్యమని రిటైర్డ్ ఆర్మీ నేవీ శివానంద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రిటైర్డ్ ఆర్మీ అధికారి హర్ సైనిక్ తిరంగా పేరుతో బిచ్కుందకు చెందిన సాయికుమార్, ప్రసాద్ ఆర్మీలో ఇద్దరు న్యావిలో సాయికిరణ్ ఒకరు విధులు నిర్వహిస్తుండగా వారి తల్లిదండ్రులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ సుబేదర్ రాములు, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాయాథ్లాన్‌లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన శ్రీవల్లిక

రాజంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలకు చెందిన 8 వతరగతి విద్యార్థిని శ్రీ వల్లిక జిల్లా స్థాయి ట్రాయాథ్లాన్‌లో ఉత్తమ నైపుణ్యం కన బరిచి ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయురాలు అరుణ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మహమ్మద్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మాత్తుగా సందర్శించి తనిఖీ చేశారు. కార్యాలయంలో భూభారతిలో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై అధికారులతో సమీక్ష నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారుల పనితీరును ఆమె సమీక్షించి, ప్రజల వినతులను పరిష్కరించి వారికి అందుబాటులో ఉండాలని వారిని ఆదేశించారు. భూభారతీ పోర్టల్ ద్వారా భూముల డిజిటల్ నమోదు,పట్టాలురైతుల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు భూమిపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు కలిగే ఇబ్బందులు, ఫిర్యాదుల పరిష్కారాలపై కూడా సమీక్షించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సవాయిసింగ్, డిప్యూటి తహసీల్దార్ శరత్‌కుమార్,ఆర్ఐ పండరి తదితరులు పాల్గొన్నారు.

శెట్పల్లిలో ఫండమెంటల్ లిటరసిపై షార్ట్ ఫిలీం

లింగంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏఎక్స్‌ఎల్ ఎఫ్ఎల్ఎన్ (అసిస్టెడ్ లాంగ్వేజ్ అయిండ్ మాథ్స్ లర్నింగ్ ఫండమెంటల్ లిటరసి నూమేరికల్) ఆర్టిఫీషిల్ ఇంటలిజెన్స్ పైన షార్ట్ ఫిలిం తీసారు. షార్ట్ ఫిలిం ప్రారంభానికి ముఖ్య అతిథిగా డీఈవో రాజు వచ్చారు. ఈ సంద్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంత మంచి కార్యక్రమం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలియజేశారు. షర్ట్ ఫిలిమ్స్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులపై ఆసక్తి పెరుగుతుందని వారికి తేలికగా విషయం అర్ధమవుతుందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎక్స్‌ఎల్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ అఖిల్, ఎంఈవో షౌకత్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుధ, కోటేశ్వర్‌రావు, ఫణికుమార్, రాజు, పీఆర్‌టీయు అధ్యక్షుడు రవీందర్ శర్మలతో పాటు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

గుర్తుతెలియని శవం గుర్తింపు

కామారెడ్డిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫాం పక్కన గల గుంతలో గుర్తుతెలియని మగవ్యక్తి శవం లభ్యమైనట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు. వయస్సు దాదాపు 30 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలుపురంగు షర్ట్, బ్లూకలరు కాటన్ ప్యాంట్ ధరించాడని తెలిపారు. ప్రస్తుతం ఆ శవం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిలో ఉందని తెలిపారు.

విద్యార్థులు ఫుల్...టీచర్లు నిల్

బిచ్కుంద, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉర్దుమీడియం హైస్కూల్ విద్యార్థులు ఫుల్‌గా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య మాత్రం నిల్‌గా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. మంగళవారం బిచ్కుంద ఉర్దు మీడియం హైస్కూల్ ఉపాధ్యాయులను నియమించాలని డీఈవోకు, కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 124 మంది విద్యార్థులకు గాను కేవలం ఇద్దరే టీచర్లు ఉన్నారని దీంతో విద్యాబోధన కుంటుపడుతుందని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్‌పటేల్, మసూద్, షేకు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామాలలో సామాజిక తనిఖీ

రాజంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందంతో సమావేశం నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో నాలుగో విడుత ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు 2024 మార్చి1 నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, ఏపీఓ శృతి, టీఏలు భాస్కర్,రాజు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

కోతుల నివారణకు చర్యలు చేపట్టాలి

ఎల్లారెడ్డి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కోతులు కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని బీజెపి పట్టణ అధ్యక్షుడు ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతులు కుక్కలు మనుషులపై దాడి చేస్తున్నాయని దీంతో పట్టణంలోని రహదారులపై కాలినడకన వెళ్లేవారు భయాందోళనకు గురి అవుతున్నారని తెలిపారు.

యూరియా ఏదయా !

(3వ పేజీ తరువాయి)

ఎక్కువ మొత్తంలో యూరియాను ఉపయోగిస్తుండడంతో సొసైటీలు, డీలర్ల వద్ద స్టాక్ అయిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో కొరత ఏర్పడుతోంది. దీంతో రైతులు సొసైటీల వద్ద యూరియా కోసం బారులు తీరుతున్నారు. గత పక్షం రోజుల కిందట తాడ్వాయి మండలంలో సొసైటీ వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టగా మంగళవారం గాంధారి మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేట్ డీలర్లు

జిల్లాలో ప్రతీ సీజన్‌లో ప్రైవేట్ డీలర్లకు సైతం వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ ఎరువులను కేటాయిస్తుంటారు. ఈ వానాకాలం సీజన్‌లో మొదటి విడత కింద వచ్చిన ఎరువుల్లో ప్రైవేట్ డీలర్లకు 2 వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులను కేటాయించారు. ప్రస్తుతం రైతుల నుంచి యూరియాకు డిమాండ్ నెలకొంటుండడంతో సొసైటీల్లో నిల్వలు ఏ రోజుకారోజే తగ్గిపోతున్నాయి. కానీ ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న స్టాక్ అలాగే ఉంది. ఇటీవల ఎరువుల ధరలు ప్రభుత్వాలు పెంచిన విషయాలు తెలిసిందే. దీంతో ప్రైవేట్ డీలర్లు యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా, డీఏపీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి స్టాక్ లేదంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ధరలుపెంచి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వనిబంధనల ప్రకారండీఏపీ బస్తాధరరూ. 1350 ఉండగా డీలర్లు రూ.1500లకు పైగా విక్రయిస్తు న్నారు. అదే విధం గా యూరియా బస్తా ధర రూ.265 ఉండగా రూ.300లకు విక్రయిస్తున్నా రు. ఇదిలాఉండగా ప్రైవేట్‌డీలర్ల వద్ద యూరియా కొనుగోలు చేయాలంటే వేరే ఎరువులు తీసుకుంటునే ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇలా ప్రైవేట్ డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తూ ఎక్కువ ధరకు విక్రయి స్తూ రైతులను దోపిడీ చేస్తున్నారనిఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా వ్యవసాయశాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు గర్ల్స్ విద్యార్థులు

కామారెడ్డిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని గర్గుల్ పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థులు వీణ,భవానీలు జాతీయ స్థాయి హాకీ పోటిలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు ఎల్లయ్య తెలిపారు. ఈనెల 3 నుంచి 8 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే పోటిలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య అభినందించారు.

రామేశ్వర్‌పల్లిలో రామాలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

భిక్కనూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఆలయ కమిటీ, వీడీసీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీ, వీడీసీ ప్రతినిధులు గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రాజకీయాలకు అతీతంగా వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామాలయం నిర్మించడం జరుగుతుందని, ఈ ఆలయ నిర్మాణానికి గ్రామస్థులతో పాటుగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థచైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ, వీడీసీ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మద్నూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు గ్రామస్తులు సన్మానించారు. వైద్యో నారాయణ హరి.. అనగా వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. కనిపించే దేవుడు రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. రోగి పరేషాన్‌కు ఏ ఆపరేషన్ చేయాలో అతడికే తెలుస్తుంది. నాడీ పట్టి గుండె గుబులు గుర్తించి దిగుళ్లను దూరం చేసే కనిపించే దేవుడు వైద్యుడు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ప్రమాదాల్లో పడిన జీవితాలకు పునర్జన్మ ఇచ్చేవాడు వైద్యుడు అని గ్రామస్తులు కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులను గ్రామస్తులు సన్మానించారు. అలాంటి రోగులకు వద్దకు వెళ్లి చికిత్స చేసేది కేవలం వైద్యులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్‌హెచ్‌వో బాధ్యతలు

నాగిరెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్‌రావుకు ఉన్నతాధికారులు ఎస్‌హెచ్‌వో బాధ్యతలు అప్పగించారు. నాగిరెడ్డిపేట ఎస్సైగా పనిచేసిన మల్లారెడ్డి సోమవారం పదవీ విరమణ చేశారు. అతని స్థానంలో కొత్తగా ఎస్సైని ఇంకా ఉన్నతాధికారులు నియామకం జరపలేదు. ఈ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైలు ఎవరు లేని కారణంగా, కొత్త ఎస్సైని నియమించే వరకు తాత్కాలికంగా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్ రావ్‌కు ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు.

దోమకొండలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

దోమకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలకేంద్రంలోని రెడ్డి సంఘం-02లో తన స్వంత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్యం ఒక వరం : డీఎల్‌పీవో



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బాల్యం ఒక వరం లాంటిదని దీనిని ఎంజాయ్ చేస్తూనే చదువుపైన ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో కొత్తగా ఆరవ తరగతిలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో స్వాగత్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను బాగా చదివిస్తూ వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తారని, తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన విద్యార్థులను కోరారు. ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో ఆరవ తరగతిలో 95 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం మోడల్ స్కూల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య 670కు చేరిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి, మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.